www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 జులై 2024
5
చిత్తూరు

హిండాల్కో కంపెనీకి అదనపు భూసేకరణ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం మండలం ఏకార్లపల్లి వద్ద ఇదివరకే ఉన్న హిండాల్కో కంపెనీ వారికి అదనంగా అవసరమైన 16ఎకరాల భూసేకరణ నిమిత్తం సోమవారం కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో జెసీ పి.శ్రీనివాసులు రైతులతో సమావేశమై చర్చించారు. కుప్పంలో వున్న హిందాల్కో కంపెనీ వారికి అదనంగా అవసరమైన బ. ́ వా విం ని కేటాయించడంలో భాగంగా రైతుల అభిప్రాయాలను తీసుకొని మరలా మరో మారు సమావేశం అవుదామని తెలిపారు. సమావేశంలో కుప్పం ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ హరికుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టమాటా బాక్సులు తొక్కి నాశనం చేసిన ఏనుగుల గుంపు

టమాట తోటలో విధ్వంసం

ఊళ్లలో గజగజ

- రైతు పంట పొలాల్లో ఏనుగుల స్వైరవిహారం
- టమాటా, మామిడి తోటల్లో దాడులు
- తీవ్రంగా నష్టపోతున్నా మంటున్న రైతులు
- అధికారులు పట్టించుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి-సోమల: ఊళ్లలో ఏనుగుల భీభత్సం కొనసాగుతోంది. అన్నదాత పంట పొలాలపై గుంపులు గుంపులుగా ఏనుగుల మందలు స్వైర విహారం చేస్తున్నాయి. టమాట, మామిడిలో అధిక నష్టాన్ని మిగిలిస్తున్నాయి. చేతి కందే పంటలు కళ్లేదుటే నాశనమవుతుంటే రైతన్నలు లబోదిబోమంటూ గుండెలు బాధుకుంటున్నారు. నష్టపోయిన పంటను చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. గత కొన్ని రోజులుగా ఏనుగులు గుంపులు గుంపులుగా విడిపోయి.. సోమల మండలంలో సంచరిస్తున్నాయి. అందులో భాగంగా ఆదివారం సాయంత్రంచ సోమవారం తెల్లవారు జామున 3 పంచాయతీలల్లో ఈ దాడులు జరిగినట్లు రైతులు తెలిపారు. అన్నెమ్మగారిపల్లి, ఆవులపల్లి, ఇరికిపెంట పంచాయతీల్లో దాదాపు 20కిలోమీటర్ల మేరా ఏనుగుల గుంపులు సంచరించినట్లు రైతులు చెబుతున్నారు. ఇరికిపెంట బంగ్లా సమీపంలోని చెన్నపట్నం చెరువు కట్ట క్రింద రైతు దశన్న టమోటా పంట ఆదివారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో బాక్సులకు నింపి టెంపో ద్వారా ఒక ట్రిప్పు మార్కెట్కు తరలించారు. తిరిగి మరో ట్రిప్పు కోసం పొలం వద్దకు 8.30గంటలకు రాగా అప్పటికే వచ్చిన ఐదు ఏనుగులు 120 బాక్సుల టమోటా ట్రేలను చిందరవందర చేసి అందులోని టమాటాలను త్రొక్కి నాశనం చేశాయి. ఆవులపల్లి పంచాయతీ మల్లేశ్వర పురానికి చెందిన కిరణ్ అనే రైతుకు చెందిన టమోటా పంటపై మూడు రోజులుగా ఒంటరి ఏనుగు మరొక ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తూ పంటను త్రొక్కి వేశాయని రైతులు తెలిపారు. అన్నెమ్మగారిపల్లి పంచాయతీలో మామిడి తోటపై దాడి చేసి కొమ్మలు విరిచి వేసి కాయలను కింద పడవేసి తీవ్ర నష్టాన్ని కలిగించినట్టు ఈ ప్రాంత రైతులు తెలిపారు. రెండు రోజుల క్రితం పెద్దదేవల కుప్పం వద్ద ఆటోలో టమోటా బాక్సులు వేసుకొని మార్కెట్కు తరలిస్తుండగా ఆటోకు ఎదురుగా 10ఏనుగుల గుంపు రావడంతో భయాందోళనకు గురైన ఆటో డ్రైవర్ ఆటోను వదిలి పారిపోగా ఆటోలోని బాక్సులను ఆటోను చిందరవందర చేసి నష్టాన్ని కలిగించినట్టు సమాచారం. హరి అనే రైతుకు చెందిన వరి నారు తొక్కి వేసి ఎందుకు పనికిరాకుండా ఏనుగుల మంద చేశాయని ఆవేదనతో తెలిపారు. ఏండ్ల తరబడి ఏనుగుల సమస్య ఈ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్నా అటు ప్రభుత్వంలో గాని ఇటు అధికారుల్లో గాని ఎలాంటి చలనం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ శాఖ వారు ఏనుగుల నివారణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- 16 నెలలు బకాయిలు వెంటనే ఇవ్వాలి
- సమాన పనికి సమాన వేతనం ప్రకటించాలి
- కలెక్టరేట్ ఎదుట ప్రకృతి వ్యవసాయ కార్మికుల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా సిఐటియు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీ కమ్యూనిటీ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, భారతిలు మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 18నెలలుగా ఇవ్వకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టగా రెండు నెలలు మాత్రమే వేతనాలు వేయడం జరిగిందన్నారు. ఈ వేతనాలు కూడా అరకొర వేయడం దారుణమని వెంటనే బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రాజకీయ వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రకృతి వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తూ ప్రభుత్వ ప్రతిష్ట పెంచుతున్న కార్మికుల పట్ల చిన్న చూపు చూడడం సరైనది కాదన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. అక్కడక్కడ కొన్నిచోట్ల రాజకీయ వేధింపులు ప్రారంభం అయ్యాయని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్కి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గాంధీ విగ్రహం నుంచి డిపిఎం ఆఫీస్ వరకు భారీ ప్రదర్శన చేసి డిపిఎంతో చర్చలు జరపడం వారు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, అగ్రికల్చర్ జెడి, డిపిఎంలు మాట్లాడుతూ ఈ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం నాయకులు హనుమంతు నీలకంటారెడ్డి, లక్ష్మీదేవి, ఓబులేసులతో పాటు భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

డీఈవోకు యూటీఎఫ్ వినతి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులకు యుటిఎఫ్ జిల్లా శాఖ నాయకులు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు జీవి రమణ, సోమశేఖర్ నాయుడు, మణికంఠ మాట్లాడుతూ జీవో నెంబర్ 117రద్దు చేసి జిఓ ఎంఎస్ నెంబర్ 55తేదీ 23.4.2021 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ఫ్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలలుగా నడపాలి, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలి, హై స్కూల్స్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలి, ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుంచి మినహాయించాలి, పని భారం తగ్గించాలని కోరారు. హై స్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటరు పైబడి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్నం భోజనం మెనూ సవరించాలని, మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. గిరిజన ప్రాంతాలలో ప్లస్ టు స్కూల్స్‌ను ఏర్పాటు చేసి సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న సిఆర్టిలను, భాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలన్నారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసును వెంటనే విడుదల చేయాలి, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ హోదాలో కల్పించాలని పలు డిమాండ్‌లతో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి.సుధాకర్ రెడ్డి, జిల్లా సహాధ్యక్షురాలు ఎస్.రెహనా బేగం, జిల్లా కార్యదర్శులు కె.రెడ్డప్ప నాయుడు, డి.ఏకాంబరం నాయుడు, ఎం.పార్థసారథి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, కె.గణేష్ కుమార్, నాయకులు సర్దారు రమేష్ నాయక్, సురేష్ బాబు, నాగరాజు, జబరాజ్, సురేంద్ర బాబు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో మామిడి బోర్డ్ ఏర్పాటు చేయాలి

- ప్రపంచ మామిడి దినోత్సవ సదస్సులో ఏఐకేఎంఎస్ డిమాండ్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని రైతులకు గిట్టుబాటు ధర చట్టంగా చేయాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ప్రపంచ మామిడి దినోత్సవ సదస్సు బంగారుపాళ్యం మండలం మ్యాంగో మార్కెట్ యార్డులో ఏఐకెఎమ్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మామిడి పంట అధికంగా పండుతోందని మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని మండలంలో మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి బోర్డు కోసం రైతులను సమీకరించి సంఘాలుగా ఏర్పాటు చేసి రైతు సంఘాల నాయకత్వంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి రైతులు సమైక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన మూడు చట్టాలు రద్దు చేయాలని లక్షలాదిమంది రైతులు ఢిల్లీ రోడ్లపై నిరసన చేపట్టి రోడ్లు దిబ్బందం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మూడు చట్టాలు రద్దు చేసేదాకా ధర్నా కార్యక్రమాలు చేశామని 750మంది రైతులు ఉద్యమంలో చనిపోయారని, రైతుల పోరాటానికి దిగివచ్చి ప్రభుత్వం మూడు చట్టాలు రద్దు చేసిందని, అలాంటి పోరాటం రైతులు చేపడితే రైతులకు గిట్టుబాటు ధర సబ్సిడీలు కరెంటు నీళ్లు అన్నీ కూడా సాధించవచ్చని ఆయన తెలిపారు. జిల్లా రైతు సమైక్య నాయకులు పద్మనాభ నాయుడు మాట్లాడుతూ రైతులు తమ సమస్యలు పరిష్కారానికి ఐక్యం కావడం లేదని గతంలో విద్యుత్తు ఉద్యమం జిల్లా రైతులతోనే పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంగా చేపట్టి ఉచిత కరెంటును సాధించామని అలాంటి ఉద్యమాల వల్లనే మామిడి రైతుకు గిట్టుబాటు ధర మామిడి బోర్డు కోల్డ్ స్టోరేజ్‌లు సాధించుకోవచ్చని రైతులంతా ఆలోచించాలని పోరాటాలలో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాగునీరు తాగునీరు కోసం హంద్రీనీవా కాలువను పూర్తి చేయాలని అందుకు రైతులు ఉద్యమాలు చేపట్టాలని ఆనంద నాయుడు, వెంకటరత్నం తెలిపారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రాజేంద్రనాయుడు, వెంకటరమణ రెడ్డి, ఉమాపతి నాయుడు, రైతు, ఆదివాసి సంఘం జిల్లా నాయకురాలు సుగుణ, ఐఎఫ్టియు చిత్తూరు జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, రైతు నాయకులు సుదర్శన్ నాయుడు, మనోజ్ కుమార్ రెడ్డి, సదాశివం, ఎండపల్లి వెంకటరమణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంగినేని పార్కులో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: గంగినేని చెరువు పార్కులోని క్యాంటీన్లో శుభ్రత లేని ఆహార పదార్థాలు, మూత లేకుండా తినుబండారాలను ఉంచడంపై నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు క్యాంటీన్ నిర్వాహకునికి రూ.5వేలు అపరాధ రుసుం విధించడంతో పాటు నోటీసు జారీ చేశారు. సోమవారం సాయంత్రం కమిషనర్ పార్కును ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా క్యాంటీన్ పరిశీలించిన కమిషనర్ తినుబండారాలపై మూతలు పెట్టకపోవడం, శుభ్రత పాటించకపోవడం, డస్ట్ బిన్లు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఓపెన్ జిమ్ పరిశీలించారు. ఓపెన్ జిమ్‌లో రిపేర్ అయిన వాటిని సత్వరం బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు, పార్కు మధ్యనున్న ఫెన్సింగ్ మరమ్మతులు చేయాలని, పాడైన టైల్స్‌ను మార్చాలన్నారు. పార్క్‌లో అందుబాటులో ఉన్న ఆట వస్తువులన్నింటినీ ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేసి సక్రమంగా నిర్వహించాలన్నారు. పార్క్ లోపల, బయట పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, సానిటరీ ఇన్స్పెక్టర్ అమర్నాథరెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం దారుణం

- కలెక్టర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం విన్నపం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లను రాజకీయ వేధింపులతో అక్రమంగా తొలగిస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్ రాజు నేతృత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఓబుల్ రాజు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1000మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను రాజకీయ నాయకుల ఆదేశాలతో అనధికార తొలగింపులకు పాల్పడుతు కొత్తవారిని అక్రమంగా నియమించు కుంటున్నారని, ఫీల్డ్ అసిస్టెంట్‌లో తొలగింపును వెంటనే ఆపాలని కోరారు. ప్రస్తుతం పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ, పిఎఫ్ ప్రమాద భీమా కల్పించాలని కోరారు. జిల్లాలో ఏ ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించలేదని అక్రమంగా తొలగిస్తే చర్యలు తీసుకుంటామని జెసీ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాలు లేకుండా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఎంపీడీవోలను హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపుపై జేసీ స్పందించడం పట్ల వ్యవసాయ కార్మిక సంఘం, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక, అభివృద్ధి, సంక్షేమ సహాయం ఏపీకి వర్తింపజేయాలి

- లోక్ సభలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

లోక్ సభలో మాట్లాడుతున్న చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఏపీ పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం కావాలని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం లోక్ సభలో విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ సర్కార్ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం నేతృత్వంలో ప్రారంభమైన తొలి విడత లోక్ సభ సమావేశాలు సోమవారం ప్రారంభమైయ్యాయి. లోక్ సభలో ప్రథమంగా జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ప్రశ్న నెంబర్ మూడుకు సంబంధించి, ప్రథమంగా ఏపీకి చెందిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకి మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ తన వాణిని వినిపించారు. రాష్ట్ర అభివృద్ధి ఆమడ దూరంలో ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఏపీని అన్ని రకాల ఆదుకోవాల్సిన బాధ్యత ఎన్డీఏ సర్కార్‌పై ఉందని విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే తమ అధినేత, సీఎం చంద్రబాబు ఏపీని ఆదుకోవాలని కోరుతూ కేంద్రానికి విజ్ఞప్తి చేసి ఉన్నారని గుర్తు చేశారు. ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడంతో పాటు ప్రజా సంక్షేమం కోరి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను కూడా ఆంధ్రప్రదేశ్‌కు వర్తింపజేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఏపీ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును, ఏపీ రాజధాని అమరావతిని నిర్లక్ష్యం చేసిందని చెప్పిన చిత్తూరు ఎంపీ వీటిని పునర్నిర్మించడం కోసం బడ్జెట్లో నిధులను కేటాయించాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిందిన కేంద్రమంత్రి.. గతంలో ఏపీకి కేంద్రం నుంచి అందించిన ఆర్థిక సహాయాన్ని లోక్ సభలో వివరించారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఎన్డీఏ సర్కార్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

సమస్యలివీ..

పరిష్కరించండి సారూ..

- జిల్లా కేంద్రానికి వినతుల వెల్లువ
- కలెక్టరేట్‌కు 182అర్జీలు
- ఎస్పీ కార్యాలయానికి39 ఫిర్యాదులు
- చిత్తూరు నగరపాలికకు 10 వినతులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి సోమవారం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అర్జీలతో విచ్చేశారు. జిల్లా సచివాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు, నగర పాలిక కార్యాలయంలో కమిషనర్ డాక్టర్ జె.అరుణ విన్నపాలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో ప్రజలు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. 182 అర్జీలు సమర్పించారు. కాగా రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 155, పోలీస్ శాఖ 5, జిల్లా విద్యాశాఖ 1, జిల్లా పంచాయతీ 1, దేవాదాయ శాఖ 1, భూగర్భ గనుల శాఖ 1, ఎస్ఈ పంచాయతీ రాజ్ 1, డిఆర్‌డిఎ 2, డిసిహెచ్ఎస్ 2, డియంహెచ్ఓ (వైద్య శాఖ)1, డిఎస్‌యల్ఓ 1, స్కిల్ డెవలప్ మెంట్ 1, ఎపిఎస్ ఆర్‌టిసి 1, డిఎఫ్ఓ 1, డ్వామా 2, సివిల్ సప్లై 2, మున్సిపల్ కమిషనర్ 1, హౌసింగ్ 1, ఎంపిడిఓ నగరి 1, సమగ్ర శిక్ష 1 చొప్పున అర్జీలు అందాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జేసీ శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పి.డి రాజశేఖర్‌లు ప్రజల సమస్యలను విన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా పోలీసుల కార్యాలయానికి ప్రజల నుంచి 39 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ మణికంఠ చందోలు నేరుగా బాధితుల ఫిర్యాదులు స్వీరించి వారి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. తక్షణ పరిష్కారానికి అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కుటుంబ తగాదాలు 5, బాలిక మిస్సింగ్ 1, వేదింపులు 3, ఇంటి తగాదాలు 1, డబ్బు తగాదాలు 8, భూ తగాదాలు 16, ఆస్తి తగాదాలు 4, మహిళ మిస్సింగ్ 1 ఫిర్యాదులు అందాయి.

నగర పాలిక కార్యాలయంలో..

నగర పాలిక కార్యాలయంలో సోమవారం కమిషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజల నుంచి విన్నపాలను స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను పురమాయించారు. తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ 5, పబ్లిక్ హెల్త్ –3, మెప్మా 1, రెవెన్యూ 1, చొప్పున మొత్తం 10 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పిడి

ప్రజాశక్తి-సోమల: రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు సోమల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం హరినాథ్ తెలిపారు. మదనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 21వ తేదీన జరిగిన రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ సెక్రటరీ శరత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సైక్లింగ్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి సోమల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు రఘునందన్, రియాన్ జిల్లా జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. ఉమ్మడి చిత్తూర్ జిల్లా జట్టుకు ఎంపికైన ఈ విద్యార్థులు ఆగస్టు నెల 9, 10, 11వ తేదీలలో కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పిడి కరుణానిధి పేర్కొన్నారు. వారిని పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- నగర మేయర్ అముద

విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న మేయర్ అముద

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని నగర మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. సోమవారం 39వ వార్డు పరిధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా ప్రభుత్వం విద్యా సామగ్రితో కూడిన కిట్లను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పార్థసారథి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి చెందిన సంఘటన మండలంలోని తుంబుకుప్పం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు సమాచారం మేరకు.. తుంబ కుప్పం అంగన్వాడి కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న సరళ గత కొంతకాలంగా అనారోగ్యంగా ఉండడంతో తిరుపతిలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల పలువురు అంగన్వాడి కార్యకర్తలు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- ఆర్థికపరమైన అంశాలపై ఉన్నతాధికారులకు సమర్పించండి

- అధికారుల సమీక్షలో కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జూన్ 25, 26వ తేదీలలో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో అర్జీలు స్వీకరించారని వీటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనలో భాగంగా ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై తీసుకున్న చర్యలను శాఖల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి శాఖకు అందిన అర్జీలలో వారు పరిష్కరించ దగ్గవి పరిష్కరించాలని, విధానపరమైన నిర్ణయాల కొరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. రెవెన్యూకు సంబంధించి సంబంధిత ఆర్డీఓలు, తహశీల్దార్‌లు చర్యలు తీసుకుంటారని, మిగిలిన శాఖల వారు వారికి అందిన మొత్తం అర్జీలలో ఎన్ని పరిష్కరించినవి, ఉన్నతాధికారులకు పంపించిన వాటి వివరాలను పూర్తిగా నివేదించాలన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను యుజి డిగ్రీ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్శిటీ ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్ తెలిపారు. యుజి డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 20 నుంచి 25 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో బిఏ (ఆనర్స్), హిస్టరీ, బికామ్ (ఆనర్స్) కంప్యూటరు అప్లికేషన్స్, బికామ్ (ఆనర్స్) జనరల్, బిబిఏ, బియస్సీ (ఆనర్స్) మ్యాథమెటిక్స్, బియస్సీ (ఆనర్స్) బయో టెక్నాలజీ, వంటి కోర్సులు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సమాచారం కొరకు విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌ను www.dravidianuniversity.ac.in సందర్శించాల్సిందిగా కోరారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - గంగవరం: మండలంలోని కీలపట్ల పంచాయతీ జర్వారిపల్లిలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది. సమాచారం అందుకున్న సర్పంచ్ చంద్రశేఖర్ స్పందించి తాగునీటి బోరు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కాలిపోవడంతో వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్‌కి మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. దీంతో ఆ గ్రామస్తులు సర్పంచ్‌ని అభినందించారు.

కలెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలానికి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు ఢిల్లీ బాబు ఆధ్వర్యంలో సభ్యులు చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. దుశ్శాలువతో సన్మానించారు. వీరి వెంట వైస్ ప్రెసిడెంట్ శాంతి కుమార్, పి.చంద్రశేఖర్, రాజేష్, వెంకటేశ్వర్లు, ఏకాంబరం, ఆలీ అబ్బాస్, గోవిందయ్య పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న లక్ష్మమ్మ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లిలోని ఎంపీపీ పాఠశాలలో దాత లక్ష్మమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. సోమవారం లక్ష్మమ్మ కుమారుడు శేషం చంద్రయ్య తోడ్పాటుతో 60మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. లక్ష్మమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించి తల్లిదండ్రులు, పాఠశాలకు గొప్ప పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. దాత లక్ష్మమ్మను హెచ్ఎం శోభ అభినందించారు. కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయురాలు పూర్ణిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల కేంద్రంలోని డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాలలో వైద్యులు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఇన్‌క్లూజివ్ సెంటర్, ఎన్ఎస్ఎస్, వైఆర్‌సి, మహిళా సాధికారత కమిటీ ఐక్యూఏసి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతి ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్ వారు ఉచిత దంత పరీక్షలు చేపట్టారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.ఫిరోజ్ బాబు, డాక్టర్ కె.దేవరాజులు, డాక్టర్ కుమార్, డాక్టర్ మౌనికలు 30మంది విద్యార్థులు, 15 మంది సిబ్బందికి దంత పరీక్షలు చేశారు.

బస్సు సర్వీసును ప్రారంభించండి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం నుంచి తిరుపత్తూరుకు నూతన బస్సు సర్వీసును ప్రారంభించాలని కోరుతూ ఆర్టీసీ సీఐ లక్ష్మణరావుకు కుప్పం రూరల్ గ్రామస్తులు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పం నుంచి గరిగచిలేపల్లి, మల్లానూరు, అడవిబూదుగురు గ్రామాల మీదగా తిరుపత్తూరు వరకు నూతన బస్ సర్వీసును ప్రారంభిస్తే ఆయా గ్రామాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, తద్వారా ఆర్టీసీకి సైతం ఆదాయం చేకూరుతుందని తెలిపారు.

శుద్ధి నీటితో ఆరోగ్యం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: శుద్ధి నీరుతో ఆరోగ్యమని జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి పీరా సాహెబ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీజనల్ వ్యాధలు, డెంగీ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆరోగ్యం మండల సూపర్వైజర్ హరికృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పీరా సాహెబ్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ఆహారపు అలవాట్లు వాతావరణంలో జరిగే మార్పు వల్ల వ్యాప్తి చెందుతాయని ప్రతి ఒక్కరు చేతుల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్య సూత్రాల పాటించాలన్నారు. కాచి చల్లార్చిన వడపోసిన నీటినే తాగాలని అందువల్ల ఆరోగ్యవంతంగా ఉండగలుగుతారని సూచించారు. జులై మాసం డెంగీ నియత్రణమాసం అని ప్రతి ఒకరు దోమల కుట్టకుండా పరిసరాల పరిశుభ్రత ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వందన త్రిపాఠీ ఎంపిహెచ్ఈఓ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి, అధ్యాపకులు శ్రీనివాసులు, ఆసీన పాల్గొన్నారు.

లేఔట్లకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- అక్రమ లేఔట్లపై చర్యలు తీసుకుంటాం
- పీకేఎం ఉడా వైస్ చైర్మన్ బాబర్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా లేఔట్లు వేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పీకేఎం వైస్ చైర్మన్ బాబర్ అన్నారు. సోమవారం ఆయన తన సిబ్బందితో పలు లేఔట్లను పరిశీలిస్తూ మండలంలోని కోగిలేరు పంచాయతీ పరిధిలో నూతనంగా వేస్తున్న లేఔట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా లే అవుట్ యాజమాన్యంకు కూడా పంచాయతీ స్థాయిలోనూ, పీకేఎం ఉడా నుండి లేఔట్‌కు తప్పక అనుమతి తీసుకోవాలని సూచించామని, వారు త్వరలోనే ఉడా నుంచి అనుమతి తీసుకుంటామని తెలిపారని చెప్పారు. వైస్ చైర్మన్ బాబర్ మాట్లాడుతూ అక్రమ లేఔట్లను ఎవరూ ఏర్పాటు చేయరాదని, అలా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీకేఎం ఉడా అనుమతి పొందే వరకు లేఔట్‌లలో ఎవరు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేయరాదని సూచించారు. లేఅవుట్ యాజమాన్యం అనుమతి తీసుకోకుండా ఇళ్ల స్థలాలకు సంబంధించి క్రయ, విక్రయాలు చేయరాదని అలా చేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక సచివాలయ సిబ్బంది, పికేఎం ఉడా సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు వృథా.. పట్టదా వ్యధ

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగిరి పట్టణంలో చావిడి వద్ద తాగునీరు పైప్ లైన్ పగిలిపోవడంతో నీరు రోడ్డుపై వృథాగా పోతోంది. చావిడికి కూత వేటు దూరంలో మున్సిపల్ కార్యాలయం ఉంది. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. రోడ్డుపై నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా స్థానిక పట్టణ ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చావడి సమీపంలో గంగమ్మ గుడి ఉండడంతో భక్తులు చాలా మంది వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడ నీరు ఉండడంతో భక్తులకు ఇబ్బందికరంగా మారింది. మున్సిపాలిటీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారుల తీరు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులను సరిచేసి తాగునీటి వృథా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

ఆకట్టుకున్న విద్యార్థుల గణిత ప్రజ్ఞాధారణ

విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులతో సన్మానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి హైస్కూల్లో సోమవారం నిర్వహించిన విద్యార్థుల గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ మాథ్స్ ఫోరంలో భాగంగా రమా రమి దినోత్సవం సందర్భంగా వేపంజేరి హైస్కూల్లో గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులలో గణితంపై ఆసక్తిని తద్వారా 200సంఖ్యలను ఏ క్రమంలో అడిగిన చెప్పడం గొప్ప ధారణ అని ఇలాంటి ధారణ కార్యక్రమానికి సంధానకర్తగా గణిత అవధాన గురువు హెచ్.అరుణ శివప్రసాద్ వ్యవహరించి విద్యార్థుల గణితంలో చేసే గారడీలు అసాధారణమన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని పలువురు కోరారు. పాపు దేసి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి స్పందించి హేమ, లహరి, పునీత్ సాయి మంగళపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను కొనియాడుతూ వారికి ప్రోత్సాహకాలను అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఆంజినేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డి, వేపంజేరి హైస్కూల్ హెచ్ఎం మురళికృష్ణ, గణిత ఫోరం జిల్లా అధ్యక్షులు చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర టెక్నికల్ కమిటీ సభ్యురాలు స్వప్న, జిల్లా కోశాధికారి మనోహర్, ఉత్తమ టీచర్ మునిరెడ్డి, టీచర్‌లు శేషగిరిరావు, జవహర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి: డాక్టర్ సోమశేఖర్

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సోమశేఖర్

ప్రజాశక్తి-విజయపురం: ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు షుగర్ బీపీ అధికంగా ఉందని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. సోమవారం నిర్వహించిన 104 వాహనం వద్ద డాక్టర్ సోమశేఖర్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు షుగర్ బీపీ పట్టణాలు మాత్రమే కనిపించేదని ప్రస్తుతం అది గ్రామస్థాయిలో ఎక్కువగా ఉందని అన్నారు. దీనికి ప్రధాన కారణం ఆహార అలవాట్లు వ్యాయామం లేకపోవడం సరైన పౌష్టికాహారం తీసుకుపోవడం అని ఆయన పేర్కొన్నారు. షుగర్, బీపీతో బాధపడేవారు ప్రతిరోజు క్రమం తప్పకుండా మందులు వాడాలని, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విహెచ్ఈఓ సుబ్బరమమ్మ, ఎంపిహెచ్ఎస్ చింతామణి, మురళి, 104 డిఈవో కుమారేష్. సూపర్వైజర్ మురళి, ఏఎన్ఎం జ్యోతి, ఆశ వర్కర్ జయంతి, సెల్వి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో మేటి ఐఆర్ఎం డిగ్రీ కళాశాల

K KAVERI No:0223019025 10/9.55 | V THRISHA HT No:0323019002 10/9.41 | S MANEESHA HT No:0223019064 10/9.29 | S HEENA KOUSA HT No:05230190 10/8.63

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పట్టణంలోని ఐఆర్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ తృతీయ సెమిస్టర్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచినట్లు కళాశాల చైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్వీ విశ్వవిద్యాలయం వారు విడుదల చేసిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల ప్రకారం సభ కళాశాలలో బీకాం విభాగంలో కె.కావేరి 9.55 పాయింట్లు, బీఎస్సీ నందు కే.త్రిష 9.41 పాయింట్లు, బిబిఏలో హీనకౌస్సర్ 8.63 పాయింట్లు సాధించి కళాశాల కీర్తి ప్రతిష్టలను మరింత పెంపొందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

'సిఆర్ రాజన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: టీడీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్‌పై చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అతని రాజకీయ దివాలా కోరు తనాన్ని తెలిపుతున్నాయని వన్నియకుల క్షత్రియ సంఘం నాయకులు ఆరోపించారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సిఆర్ రాజన్ బీసీ వెనుకబడిన కులాల నాయకుడుగా పొందుతున్న అద్భుతమైన ప్రజాదారణను చూసి ఓర్వలేక, సిఆర్ రాజన్ పట్ల చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం ఆయన మరింత దిగజారు రాజకీయ స్థాయి తప్ప మరొక్కటి కాదని ఎద్దేవా చేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తీరు మార్చుకోవాలంటూ మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో నాయకులు విజయన్, ఉదయ్, సుగ్రీ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో 24వ వార్డు

ప్రజాశక్తి-విజయపురం(నగరి): నగిరి పట్టణంలోని 24వార్డులో విద్యుత్ దీపాలు లేక అంధకారంగా మారింది. కొత్త తల్లారి వీధిలో సుమారు 200మంది నివాసం ఉంటున్నారు. అయితే టాక్స్‌లు కట్టలేదని వేదిస్తున్న మున్సిపాలిటీ అధికారులు పట్టణంలో వీధిలైట్లు లేవని గుర్తించడం లేదా అని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విష సర్పాల సంచారం అధికంగా ఉంది, కాగా వీధుల్లో వెలుతురు ఎంతో అవసరం అయితే వీధిలైట్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు ఆ వార్డు ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



24వ వార్డులో వెలగని విద్యుత్ దీపాలు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. విధిగా లైసెన్సులు, రికార్డులు వెంట పెట్టుకోవాలన్నారు. అధిక బరువుతో రవాణా చేపట్టకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అభాండాలు మోపితే సహించం: మాజీ ఎంపిపి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: గెలిచిన ఎమ్మెల్యేపై అబాండాలు మోపితే సహించేది లేదని మాజీ ఎంపిపి జనార్దన్ రాజు అన్నారు. సోమవారం కార్వేటినగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కొందరు నాయకులు మండలంలోని సీనియర్ నాయకులకు, ప్రోటోకాల్ లేకుండా, తెలియకుండా కొన్ని కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదులు చేయడంపై మండల పార్టీ అధ్యక్షులు చెంగల్‌రాయులు యాదవ్ ఫైర్ అయ్యారు. మండలంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా క్రమశిక్షణతో కలిసి చర్చించుకొని ముందుకు వెళ్లాలని సూచించారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీవాణి, పద్మావతి ప్రభంజనం

ప్రజాశక్తి-గంగవరం: ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ థర్డ్ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీవాణి, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి తెలిపారు. ఫలితాల్లో ఎంఈసీఎస్ గ్రూప్‌లో దీపిక 92శాతం, బిజెడ్‌సీ గ్రూప్‌లో మౌనిక 94శాతం, బికాం (సీఏ)లో రూప 94శాతం, మాధవి 94శాతం, గౌతమి 93శాతం, సుప్రీత 93శాతం, వీరు యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించారు. అదే విధంగా కళాశాలలో మొత్తం 55మంది డిస్టెన్షన్లు, 36మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని కళాశాల ప్రిన్సిపల్ సిపి శ్రీవాణి తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందంను ప్రిన్సిపాల్ అభినందించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డిఈవో ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇస్తున్నారు. రూరల్ మండలంలోని గొల్లపల్లి హైస్కూలులో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ అందించారు. పుత్తూరు గొల్లపల్లి జడ్పీ హైస్కూలుకు చెందిన 3 స్కౌట్ యూనిట్లు, రెండు గైడ్ యూనిట్లు ప్రవేశ శిక్షణ ముగించుకున్నాయి. గొల్లపల్లి జెడ్పి హైస్కూల్ స్కౌట్ మాస్టర్ ఏ గోపికృష్ణ, ఏ నరసింహులు, వి చంద్రశేఖర్, గైడ్ కెప్టెన్ కే హేమావతి, ఎం రాధిక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ, సమాజ సేవలను, ఇతరుల పట్ల దయాగుణం అలవరుచుకోవాలని సూచించారు. అన్నిట్లోనూ స్కౌట్ అండ్ గైడ్స్ సహకరిస్తుందని విద్యార్థులకు స్కౌట్ అండ్ గైడ్స్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చిన్నతనం నుండి మంచి విషయాలను శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందడానికి సమాజ సేవలో భాగం పంచుకోవడానికి, ఇతరుల పట్ల సేవా కార్యక్రమాన్ని నిర్వహించడానికి చాలా ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు. ఆ తర్వాత విద్యార్థులు తమ వంతుగా స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి క్లీన్ అండ్ గ్రీన్‌ని పరిసరాల పరిశుభ్రత సేవలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఉపకులపతికి అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావును డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం నేతలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు రకాల సమస్యల గురించి, భవనాలు, క్రీడ ప్రదేశాలను గురించి విన్నవించుకున్నారు. డిగ్రీ కళాశాలలతో విశ్వవిద్యాలయం అధికా రులు సమన్వయంతో అభివృద్ధి పథంలో తీసుకు రావ డానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి నరసింహులు, నరసింహ వర్మ, పి సుజన, తమటం రామ చంద్రారెడ్డి, మన్యం నరసింహులు, భాస్కర్ రాజు, పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా విద్యార్థుల ప్రతిభ

K ROHINI BSC 9.55 | D MOUNIKA BSC 9.19 | VS ASWINI BSC 9.49 | G SNEHA BCOM 9.14
A SAMEERA BCA 9.23 | G KUSUMA BCOM 9.15 | Y CHANDANA B.COM 9.05 | S MAHEEN BBA 9.03
S SAMEERA BSC 9.38 | T MYTHRI BCOM 9.08 | AN KAVYA SREE BCA 9.49 | K LOKESH REDDY BBA 9.17
M POOJITHA BSC 9.29

ప్రజాశక్తి-గంగవరం: ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని మదర్ థెరిస్సా కళాశాల ప్రిన్సిపల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఫలితాల వివరాలను వెల్లడించారు. బీఎస్సీ చదువుతున్న అశ్విని, సమీరా, పూజిత, మౌనిక, బిసిఏ చదువుతున్న కావ్య శ్రీ, స్నేహ, సమీరా, బిబిఏకు చెందిన లోకేష్ రెడ్డి, మహేష్, బీకాం చెందిన కుసుమ, స్నేహ, మైత్రి, చందన వీరు జిఎస్ జిపిఎస్ సాధించి ఎస్వీ యూనివర్సిటీలో టాపర్ నిలిచారన్నారు. బిఎస్సీ, బిసిఏ, బీకాం కోర్సులు చదువుతున్న 230మంది డిస్టెన్స్ నందు గాను 120మంది ప్రథమ శ్రేణిలో నిలిచారని ఆయన వెల్లడించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను కళాశాల చైర్మన్ రవీంద్రబాబు, అకాడమిక్ అధికారి రాజేందర్ రెడ్డిలు అభినందించారు.

'సూపర్ మార్కెట్‌లో ఎలాంటి కమీషన్ తీసుకోవడం లేదు'

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలోని ది కోఆపరేటివ్ సూపర్ బజార్‌కు 24మంది పలమనేరు డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ తరపున నిత్యవసర వస్తువులను పలు ఏజెన్సీల ద్వారా అందజేస్తున్నామని డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ఇన్‌ఛార్జ్ నాగేంద్ర తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో విలేకరుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటర్స్ సభ్యులు మాట్లాడుతూ.. సూపర్ బజార్ తమ ఏజెన్సీల ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తున్నామని అయితే బిల్లు అందజేసిన వెంటనే నగదును మాకు సంబంధించిన బ్యాంకు అకౌంట్‌కు చెల్లించడం జరుగుతుందన్నారు. అతి తక్కువ లాభంతో నిత్యవసర వస్తువులను ది కోఆపరేటివ్ సూపర్ బజార్‌కు తాము అందిస్తున్నామన్నారు. తమ వద్ద ఎలాంటి కమీషన్‌ను ది-కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి. సుభాష్ చంద్రబోస్ ఆశించలేదని ఇది కేవలం ఆరోపణలే మాత్రమేనని వీటిని తాము ఖండిస్తున్నామని తెలిపారు. అలాగే పట్టణంలోని రిలయన్స్ మోర్ లాంటి వాటితో పాటు సూపర్ బజార్‌కు నిత్యాసర వస్తువులను సరఫరా చేస్తున్నామన్నారు. అయితే రిలయన్స్ కంటే అత్యధిక మోతాదులో నిత్యవసర వస్తువులను కొనుగోలు చేస్తున్నది ది కోఆపరేటివ్ సూపర్ బజార్ మాత్రమేనన్నారు. కాగా బిల్లు లేకుండా సూపర్ బజార్‌లో నిత్యవసర సరుకులను తమ వద్ద కొనుగోలు చేయరన్నారు. పార్టీలకు అతీతంగా తాము వ్యాపారాలు చేపడుతున్నామని వారు తెలిపారు.

బస్సొచ్చేనా.. గమ్యం చేరేమా.!

- ఆర్‌టీసీ బస్సు కోసం ప్రయాణికుల పడిగాపులు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల నుంచి చౌడేపల్లి, పుంగనూరు ప్రాంతాలకు ఉదయం వేళలో వెళ్లాల్సిన ప్రయాణికులకు సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సుల కారణంగా ఎదురుచూపులతోనే నిమిషాలు గంటలుగా గడిచిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి 10గంటల మధ్య ప్రాంతంలో కార్యాలయాలకు వెళ్లేవారు. విద్యార్థులు నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరులో ఇతర వ్యాపార పనుల కోసం వెళ్లే ప్రయాణికులకు బస్సులు సమయానికి రాకపోవడంతో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. ముఖ్యంగా ప్రయాణికులు దుకాణాల ముందు నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ఎండ తీవ్రత కారణంగా చాలా సేపు వేచి ఉండే పరిస్థితి ఏర్పడడం వల్ల, ఎంతసేపటికి బస్సులు రాక పోవడంతో చివరకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు అంటున్నారు. ఆర్టీసీ పుంగనూరు డిపో వారు ప్రయాణికుల అవస్థలను గుర్తించి బస్సులు సమయపాలన ప్రకారం నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉదయం 10గంటల సమయంలో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు